క్లుప్తంగా

అరకొర వేతనాలతో కార్మికుల అవస్థలు



మాట్లాడుతున్న నాగేశ్వరరావు

మండపేట: మండపేట నియోజకవర్గంలో కార్మికుల అభ్యున్నతికి తన శక్తివంచన లేకుండా కృషి చేస్తానని వైఎస్సార్‌సీపీ కార్మిక విభాగం అధ్యక్షుడు శెట్టి నాగేశ్వరరావు పేర్కొన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ తనను ఈ పదవికి ఎంపిక చేసిన ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులుకు తన కృతజ్ఞతలు తెలిపారు. మండపేట నియోజకవర్గంలో సుమారు 100 కుపైగా రైసుమిల్లులున్నాయని వాటిలో పదివేల మంది కార్మికులు చాలీచాలని వేతనాలతో పనిచేస్తూ అర్ధాకలితో జీవిస్తున్నారని వాపోయారు. వారందరికీ కనీస వేతనాల చట్టం, రోజుకు 8 గంటల పని దినాలు, మహిళా కార్మికులకు భద్రత, క్యాంటీన్ ఏర్పాటు వంటివి ఏర్పాటు చేయడానికి యాజమాన్యం, కార్మిక శాఖ అధికారులతో చర్చిస్తానని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన కార్మిక బీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. రూ.110 చెల్లించడం ద్వారా 18 ఏళ్ల నుంచి 65 ఏళ్ల వరకూ ఉన్న కార్మికులు, తెల్లరేషన్‌కార్డులు కలిగి ఉన్న వారు అర్హులు అన్నారు. ప్రమాదశాత్తు మరణం వల్ల రూ.6 లక్షలు, సహజ మరణం రూ.1.30 లక్షలు, ఆడపిల్లలకు ఒక్కొకరికీ రూ.30 వేలు, ప్రసవ కానుకగా రెండు ప్రసవాలకు రూ.30 వేలు చొప్పున పరిహారం కేంద్ర ప్రభుత్వం అందిస్తుందన్నారు.

సంపూర్ణ పారిశుధ్యానికి ప్రజలు సహకరించాలి



21వ వార్డులో పారిశుద్ధ్య పనులను పరిశీలిస్తున్న చైర్ పర్సన్ శ్రీదేవి

రామచంద్రపురం: మున్సిపాలిటీ పరిధిలో సంపూర్ణ పారిశుధ్యానికి నిర్వహణకు ప్రజల సహకారం ఎంతో అవసరమని మున్సిపల్ చైర్ పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి అన్నారు. పట్టణంలోని 21వ వార్డులో ఆమె శుక్రవారం పాశుధ్య నిర్వహణ పనులను తనిఖీ చేశారు. డ్రెయిన్ల శుభ్రత, చెత్త సేకరణ వంటి వాటిని మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్ మాట్లాడుతూ ప్రతి రోజు ఉదయం ఇంటింటికీ వస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు ప్రజలు సహకరించి చెత్తను అందించాలన్నారు. వీధుల్లో ఎక్కడ పడితే అక్కడ చెత్తను వేయరాదని, వీధుల్లో చెత్త లేకుండా చూడాలన్నారు.

గ్రౌండ్ ఫ్లోర్‌లో ఇల్లు మంజూరు చేయండి

రామచంద్రపురం: కొత్తూరులో నిర్మించిన టిడ్కో గృహాల్లో తనకు కింద ఫ్లోర్‌లో ప్లాట్‌ను కేటాయించాలని పట్టణానికి చెందిన దివ్యాంగుడు చాపల సత్తిపండు మున్సిపల్ కమిషనర్ అయ్యప్పనాయుడుకి శుక్రవారం వినతిపత్రం అందజేశారు. సత్తిపండుకు గతంలో ప్రభుత్వం మంజూరు చేసిన టిడ్కో గృహాల్లో రెండవ అంతస్తులో ప్లాట్ నంబర్ 57ను కేటాయించారు. మెట్లు ఎక్కలేని ఆయన ఆ ప్లాట్‌లోనికి వెళ్లలేక పోయారు. దీంతో పట్టణానికి చెందిన రాంబాబు నాయుడుతో కలిసి ఆయన కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు.

భీమేశ్వరస్వామి సన్నిధిలో జిల్లా అదనపు జడ్జి పూజలు



ద్రాక్షారామ భీమేశ్వరాలయంలో రామచంద్రపురం జిల్లా కోర్టు ఇన్‌చార్జి జడ్జి హరినారాయణ

రామచంద్రపురం రూరల్: ద్రాక్షారామ మాణిక్యాంబ సమేత భీమేశ్వరస్వామిని రామచంద్రపురం జిల్లా కోర్టు ఇన్‌చార్జి జడ్జి ఎం. హరినారాయణ శుక్రవారం దర్శించుకున్నారు. ఆలయ సిబ్బంది, అర్చకులు ఆలయ మర్యాదలతో ఆయనకు స్వాగతం పలికారు. భీమేశ్వర స్వామిని, మాణిక్యాంబ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో ఆయనకు వేద పండితులు వేదాశీర్వచనం అందజేశారు.

వీధిలో మురుగునీటితో అవస్థ



డ్రెయినేజీ నీటిలో చిన్నారిని పాఠశాలకు తీసుకెళుతున్న మహిళ

రామచంద్రపురం రూరల్: మేజర్ పంచాయతీ ద్రాక్షారామ మండాలమ్మపేటలోని కొత్తపేటలో డ్రెయినేజీ నుంచి మురుగునీరు వీధుల్లోకి చేరడంతో స్థానికంగా నివసిస్తున్న ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. డ్రెయినేజీ నీరు దుర్గంధం రావడంతో పాటు ఇటు దోమల వృద్ధికి కారణమవుతోందని స్థానికులు తెలిపారు. డ్రైనేజీ నీరు వీధుల్లోకి రాకుండా ప్రజాప్రతినిధులు, అధికారులు చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

పరీక్షా సమయం ఆసన్నం

- త్వరలో పది, ఇంటర్, డిగ్రీ పరీక్షలు
- అందమైన చేతిపై చిన్నారులకు శిక్షణ
- కష్టపడి చదువుతున్న విద్యార్థినీ విద్యార్థులు



ద్వారపూడి పాఠశాలలో దస్తూరీపై తర్ఫీదు పొందుతున్న విద్యార్థులు

మండపేట: విద్యార్థినీ విద్యార్థులకు ఫిబ్రవరి, మార్చి నెలల్లో పరీక్షల నెలలు. ఏడాది పాటు కష్టపడి చెమటోడ్చి విద్యానభ్యసించిన వారు మూడు గంటల్లో పూర్తయ్యే పరీక్షల్లో ప్రశ్నాపత్రాలకు సరైన సమాధానాలు అందంగా రాయాలి. ఏడాది శ్రమ మూడు గంటల్లో ఫలితాలను నిర్దేశిస్తుంది. తల్లిదండ్రులు తమ పిల్లలు పరీక్షలపై దృష్టి సారించి వారిని శాంతియుత ఆహ్లాదకర వాతావరణంలో చదివించాలి. చీటికీ మాటికి వారిపై విసుగు, కోపం ప్రదర్శించరాదు. ముఖ్యంగా పదో తరగతి పరీక్షలు ఇంటర్ పరీక్షలు విద్యార్థి భవిష్యత్తును దశ దిశ నిర్దేశనం చేస్తాయి. పరీక్షల్లో మంచి మార్కులు రావాలంటే ప్రతి ప్రశ్నకు క్షుణ్ణంగా జవాబు మంచి దస్తూరితో రాయాలి. అందమైన చేతిరాత, స్పష్టమైన జవాబులు రాస్తే అధిక మార్కులు సాధించవచ్చు. పరీక్షల సమయంలో బాలబాలికలు మానసిక ఒత్తిడికి గురికాకుండా వారి తల్లిదండ్రులు ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలి. ఈ మార్కులే ఉన్నత చదువుల కోసం సీట్లు, ఉద్యోగాలు పొందేందుకు వెయిటేజీ మార్కులుగా ఉపయోగపడి భవిష్యత్తు బంగారుబాట వేస్తుంది. మండపేట, రూరల్ మండలంలో ప్రభుత్వ పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ముఖ్యంగా చేతిరాతకు అత్యంత ప్రాధాన్యతనిచ్చి శిక్షణ ఇచ్చారు. ఈ చేతిరాత వల్ల కలిగే ప్రయోజనాలను నిపుణులు వివరిస్తున్నారు. జవాబుపత్రంలో పైన అంగుళం స్థలం, ఎడమ వైపు కుడివైపున అంగుళం చొప్పున మార్జిన్ వదిలి ప్రశ్నాపత్రాలకు సమాధానాలు రాయాలి.

అందమైన చేతిరాతతో అధిక మార్కులు



పరీక్షల్లో జవాబులు రాసేటప్పుడు అక్షరాలు అందంగా రాయాలి. సమాధాన పత్రంలో జవాబులు సూటిగా, పొందికగా ఉంటే పరీక్ష పేపర్లు దిద్దేవారు పూర్తిస్థాయి మార్కులు వేసే అవకాశం ఉంటుంది. పేజీ పై భాగంలో ఒక అంగుళం, ఎడమవైపు ఒక అంగుళం మార్జిన్ విడిచి పెట్టాలి. అక్షరాలు, పదాలు, వాక్యాలు మధ్య తగినంత ఖాళీ ఉంచాలి.

– గండి స్వామి ప్రసాద్, అభ్యుదయ రచయితల సంఘం జిల్లా అధ్యక్షుడు, మండపేట

ప్రణాళికతో చదివితే విజయం తథ్యం



నూతన పాఠ్యపుస్తకాలు, కొత్త ప్రశ్నాపత్రాల విధానాలతో విద్యార్థులు ఎటువంటి ఆందోళన చెందకుండా భాషల విషయంలో వ్యాకరణాంశాలపై, భాషేతర అంశాల్లో లఘు సమాధాన ప్రశ్నలపై, మ్యాప్ పాయింటింగ్, సైన్సులో చిత్రాలపై శ్రద్ధపెట్టాలి. మాదిరి ప్రశ్నలను ఎక్కువగా సాధన చేస్తూ, చక్కని చేతి రీతతో ప్రణాళికాబద్ధంగా చదివితే ఈ పరీక్షల్లో మంచి మార్కులు సాధించవచ్చు.

– ద్వారంపూడి స్రవంతి, తెలుగు పండిట్, జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల, ద్వారపూడి

సమయపాలన పాటించాలి



పరీక్షలు రాసేటప్పుడు సమయపాలన పాటించకుంటే సకాలంలో జవాబులు ఇవ్వలేక నష్టపోతారు. చేతిరాత ఎదుటివారికి అర్థమయ్యే రీతిలో ఉండాలి. వీలైనంత వరకు అక్షరాలను స్పష్టంగా రాయగలగాలి. స్పీడ్ రైటింగ్ ప్రాక్టీస్ చేయాలి. ఇచ్చిన సమయాన్ని వృథా చేయకుండా జవాబులు రాయాలి.

– డాక్టర్ చల్లా రవికుమార్, హోమియో వైద్యుడు, మండపేట

మంచి చేతిరాతతో ప్రయోనాలెన్నో..



విద్యార్థినీ విద్యార్థులు మంచి చేతి రాతను అలవర్చుకోవాలి. బాల్యం నుంచి శిక్షణ ఇస్తేగానీ మంచి రాత రాయలేరు. మంచి చేతి రాత వల్ల, అక్షరాలు గుండ్రంగా రాయడం వల్ల పలువురి మన్ననలను పొందవచ్చు. టెన్త్ నుంచి సివిల్స్ పరీక్షలు వరకూ చేతిరాతను చూసే మార్కులను వేయడం జరుగుతుంది.

– పడాల రామచంద్రారెడ్డి, ఉపాధ్యాయుడు, గౌతమి మున్సిపల్ హైస్కూల్, మండపేట

రాష్ట్ర యూత్ బాస్కెట్‌బాల్ కెప్టెన్‌గా హర్షతేజ



హర్షతేజను అభినందిస్తున్న జీవీ రావు

రామచంద్రపురం: రాష్ట్ర యూత్ బాస్కెట్ బాల్ టీమ్‌కి మోడరన్ హైస్కూల్లో పదవ తరగతి చదువుతున్న కొడమంచిలి హర్షతేజ కెప్టెన్‌గా ఎన్నికైనట్టు మోడరన్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ జీవీ రావు శుక్రవారం తెలిపారు. పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో హర్షతేజను జీవీరావు అభినందించారు. ఈ సందర్భంగా జీవీ రావు మాట్లాడుతూ ఈ నెల 8 నుంచి 11వ తేదీ వరకు పిఠాపురంలో నిర్వహించనున్న రాష్ట్ర యూత్ బాస్కెట్ బాల్ టీమ్‌కి కెప్టెన్‌గా హర్ష తేజ వ్యవహరిస్తారన్నారు. ఈ సందర్భంగా హర్షతేజని రాష్ట్ర బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి జి. చక్రవర్తి, డాక్టర్. చెలికాని స్టాలిన్, హైస్కూల్ అకడమిక్ డైరెక్టర్ ఆర్.ఉమాదేవి, ప్రధానోపాధ్యాయుడు చిట్టిబాబు, హైస్కూల్ స్టాఫ్ అభినందించారు.

17 నుంచి రేమా పెంతుకోస్తు సంఘం వార్షికోత్సవం

కపిలేశ్వరపురం: అంగరలోని ప్రతిష్ఠాత్మకమైన రేమా పెంతుకోస్తు సంఘం 20వ వార్షికోత్సవాన్ని ఈ నెల 17 నుంచి 20 వరకూ నిర్వహించనున్నట్టు శుక్రవారం నిర్వాహకులు జ్యోత్స్నరాణి తెలిపారు. పడమర ఖండ్రికలోని హల్లెలూయ గ్రౌండ్స్‌లో నిర్వహించనున్న క్రైస్తవ మహా సభల్లో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి సువార్తీకులు హాజరవుతారన్నారు.

విశ్వసనీయ రాజకీయాలకు ఊపిరి పోసిన జగనన్న పాలన

జిల్లా యువజన విభాగ అధ్యక్షుడు సూర్యప్రకాశ్



వైఎస్సార్‌సీపీ జిల్లా యువజన విభాగ అధ్యక్షుడిగా నియమితులైన సూర్యప్రకాశ్‌ను అభినందిస్తున్న నాయకులు

కాజులూరు: రాష్ట్రంలో తెలుగుదేశం నాయకుల అబద్ధపు హామీలతో ప్రజల్లో విశ్వాసం కోల్పోయిన రాజకీయాలకు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన పాలనతో ఊపిరి పోసారని రామచంద్రపురం నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్ పిల్లి సూర్యప్రకాశ్ అన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పార్టీ యువజన విభాగ అధ్యక్షుడిగా సూర్యప్రకాశ్ నియమితులైన సందర్భంగా మండలంలోని పలు గ్రామాలకు చెందిన పార్టీ నాయకులు శుక్రవారం ఆయనను కలుసుకుని అబినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2014 ఎన్నికలలో చంద్రబాబునాయుడు ఎన్నో హామీలిచ్చి ఏ ఒక్కటి పూర్తిస్థాయిలో అమలు చెయ్యలేదన్నారు. నవరత్నాల పథకంలో భాగంగా పాదయాత్రలో ప్రజలకు ఇచ్చిన హామీలతో పాటు అదనంగా మరో 50 కొత్త పథకాలు వైఎస్ జగన్ అమలు చేసారన్నారు. అయితే సూపర్‌సిక్స్ పేరుతో 2024లో అనేక పథకాలు ప్రకటించి అధికారంలోనికి వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు తన నైజాన్ని చాటుకుంటూ మరోమారు ప్రజలను మోసం చేస్తున్నారన్నారు. తణుకువాడ మాజీ ఎంపీటీసీ పితాని సుబ్రహ్మణ్యం, మండల యువజన విభాగ అధ్యక్షుడు పెంకే వెంకటరమణ, మాదిరెడ్డి పృద్విరాజ్, వైఎస్సార్ యువసేన రాష్ట్ర కార్యదర్శి ఉంగరాల శివ, చొల్లంగి వెంకన్న తదితరులు సూర్యప్రకాశ్‌ను అభినందించిన వారిలో ఉన్నారు.

వాకింగ్ ట్రాక్ నిర్మాణానికి పేదల ఇళ్ల కూల్చివేత

- రోడ్డున పడ్డ 38 పేద కుటుంబాలు
- కూల్చివేతలో ఆలయాలకు మినహాయింపు



పేదల ఇళ్లను కూల్చివేస్తున్న దృశ్యం

మండపేట: నడక దారి నిర్మాణానికి పేద కుటుంబాల నివాసాలను కూల్చివేసి వారిని నిరాశ్రయులను చేసిన ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కింది. బడుగు, బలహీన వర్గాల ప్రజలపై పాలకులు కనికరం చూపడం లేదు. వివరాల్లోకి వెళితే మండపేట రూరల్ మండలం ఏడిద పంచాయతీలో పెద్ద చెరువును ఆనుకుని 38 కుటుంబాలు పాకలు వేసుకుని జీవిస్తున్నాయి. 50 ఏళ్లుగా వీరంతా సువిశాలమైన చెరువు గట్లపై పాకలు వేసుకుని జీవనం సాగిస్తున్నారు. కొందరైతే భవనాలు నిర్మించుకుని పంచాయతీకి పన్నులు, విద్యుత్ శాఖకు బిల్లులు దశాబ్దాల కాలంగా చెల్లిస్తున్నారు. మూడు తరాలుగా అక్కడే వారంతా తమ జీవనాన్ని సాగిస్తున్నారు. ఈ చెరువు గట్టుపై రెండు ఆలయాలు నిర్మించారు. ఈ ఆలయాలను కూల్చి వేస్తే గ్రామానికి అరిష్టమని భావించి మినహాయింపునిచ్చారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే గ్రామంలోని కొందరు బడా బాబులు వాకింగ్ ట్రాక్‌ను పెద్ద చెరువు గట్టు చుట్టూ నిర్మించాలని ప్రతిపాదించి ప్రజాప్రతినిధుల ముందుంచారు. వీరికి తోడు అదే గ్రామానికి చెందిన ఒక పారిశ్రామిక వేత్త ముందుకు వచ్చి తన వంతుగా రూ.2 కోట్ల విరాళం ప్రకటించి, ఆ సొమ్ముతో వాకింగ్ ట్రాక్ అత్యాధునిక పద్ధతిలో నిర్మిస్తానని హామీ ఇచ్చారు. ఈ హామీ నిరుపేదల పాలిట శాపంగా మారింది. ఫలితంగా హుటాహుటిన జేసీబీలను రప్పించి రెండు రోజుల్లో చెరువు గట్లపై ఉన్న 38 నివాస గృహాలను కూల్చి వేశారు. బాధితులకు వేరొక చోట ఇంటి పట్టాలు అందజేస్తామని, రూ 90 వేలు ఒక్కొరికీ అందజేస్తామని కూటమి నేతలు హామీలిచ్చారు. అయితే 38 మందిలో 30 మందికి మాత్రమే పరిహారం అందింది. మిగిలిన వారికి మొండి చేయి చూపారు. బాధితుల గోడును పట్టించుకునే నాథుడు కరువయ్యారు.

ఆల్బెండజోల్ మాత్రలతో నులిపురుగు నివారణ



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న డాక్టర్ ప్రశాంతి తదితరులు

రామచంద్రపురం: పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు వేయటం ద్వారా రక్తహీనతను నివారించవచ్చునని సబ్‌డివిజనల్ వైద్యాధికారిణి డాక్టర్ ఎస్ ప్రశాంతి అన్నారు. నేషనల్ డి వార్మింగ్ డే సందర్భంగా రత్నం పేట మున్సిపల్ హైస్కూల్లో మండలంలోని అన్ని పాఠశాలల ఉపాధ్యాయులతో, అంగన్‌వాడీ టీచర్లతో, వైద్య సిబ్బందితో అవగాహన సదస్సును శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సబ్ డివిజనల్ అధికారిణి డాక్టర్ ఎస్ ప్రశాంతి ముఖ్యతిథిగా పాల్గొని పోస్టర్‌ను ఆవిష్కరించారు. డీ వార్మింగ్ డే కార్యక్రమాన్ని ఈనెల 10న అన్ని అంగన్‌వాడీలు, పాఠశాలలు, కళాశాలల్లో 1–19 సంవత్సరాల వయస్సుగల పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు భోజనం అనంతరం మింగించాలని తెలిపారు. డాక్టర్ లక్ష్మీ ప్రసన్న మాట్లాడుతూ ఈ మాత్రలు వేసుకోవడం వల్ల పిల్లల్లో నులిపురుగులను నిర్మూలించవచ్చని దాని మూలంగా పిల్లల్లో రక్తహీనతను నివారించవచ్చునని తెలిపారు. డాక్టర్ డి.హేమ సుధీర్ మాట్లాడుతూ పిల్లల చేతులు శుభ్రంగా ఉంచుకోవాలని శుభ్రమైన నీటిని, ఆహారాన్ని తీసుకోవాలని, బహిరంగ ప్రదేశాల్లో మల విసర్జన చేయరాదన్నారు. డాక్టర్ డీవీఎస్ వీరభద్రారెడ్డి మాట్లాడుతూ ఫిబ్రవరి 10న మాత్రలు పొందలేని పిల్లలు 17న తీసుకోవలన్నారు. డివిజనల్ సూపర్‌వైజర్ జి కమల్ శేష్ మాట్లాడుతూ రామచంద్రపురం మండల పరిధిలో 91 అంగన్‌వాడీ సెంటర్లలో 102 పాఠశాలల్లో 12 టెక్నికల్ నాన్ టెక్నికల్ కళాశాలలో మొత్తం 23,265 పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు మింగిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఈవోలు టీ వీరరాఘవరెడ్డి, వి.నాగేశ్వరి, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

అవగాహనతోనే సంపూర్ణ ఆరోగ్యం

కపిలేశ్వరపురం: అవగాహనతోనే సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందగలుగుతారని అంగర పీహెచ్‌సీ వైద్యాధికారిణి పీఎస్ఎస్‌డీ రత్నకుమారి అన్నారు. ఈనెల 10న డీవార్మింగ్ డే సందర్భంగా రూపొందించిన ప్రచార వాల్ పోస్టర్‌ను శుక్రవారం పీహెచ్‌సీ ఆవరణలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నులిపురుగుల ప్రభావంతో చిన్నారులు అనారోగ్యానికి గురవుతారన్నారు. ఆ నేపథ్యంలో పీహెచ్‌సీ పరిధిలోని గ్రామాల ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో డీవార్మింగ్ డే ప్రాధాన్యతను, నులిపురుగుల ప్రభావాలను విద్యార్థులకు వివరిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీహెచ్ఈఓ జిత్తుక మల్లికార్జునుడు, హెచ్ఈ బి.రామారావు, హెచ్‌వీ తాతపూడి మేరీమణి, వైద్య, ఆరోగ్య, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.



అంగరలో వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న వైద్యాధికారి డాక్టర్ రత్నకుమారి

ఘనంగా వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం



అంగరలో వేంకటేశ్వర స్వామి ఆలయంలో పూజలందుకున్న దేవతామూర్తులు

కపిలేశ్వరపురం: అంగరలోని అలివేలు మంగ గోదాదేవీ సమేత వైభవ వేంకటేశ్వరస్వామి దశమ బ్రహ్మోత్సవాలను శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆలయ ప్రధాన అర్చక బృందం ఆధ్వర్యంలో స్వామిని విశేషంగా అలంకరించారు. ఆలయ కమిటీ చైర్మన్ దాసర లక్ష్మణమూర్తి, కార్యదర్శి పెద్దింశెట్టి రామస్వామి, వైస్ చైర్మన్ సూరంపూడి వెంకట్రావు, సహాయ కార్యదర్శి మోటిపల్లి వీవీ సత్యనారాయణమూర్తి, కోశాధికారి వాసా కోటేశ్వరరావు, వెల్ల శ్రీనివాస్, సంకాబత్తుల స్వామికాపు ఏర్పాట్లను పర్యవేక్షించారు. వేద పండితులు ఆలయంలోని కల్యాణమూర్తులకు తిరుమంజన సేవ, విశేష పుష్పార్చన, నీరాజన మంత్ర పుష్పాలు, తీర్థ ప్రసాద గోష్ఠి, విష్వక్సేన ఆరాధన, పుణ్యాహావాచనం, రక్షాసూత్ర ధారణ, యాగశాల ప్రవేశం పూజలు చేశారు. అంగర, పడమర ఖండ్రిక గ్రామాల భక్తులు పాల్గొన్నారు. శనివారం స్వామి కల్యాణ పూజలు, ఆలయం వద్ద అన్న సమారాధన నిర్వహించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు.

ఆర్‌టీఐ ద్వారా ప్రభుత్వ అవకతవకలు బహిర్గతం



మండపల్లి రవికుమార్

మండపేట: వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగాల్లో ఒకటైన నియోజకవర్గ ఆర్‌టీఐ అధ్యక్షుడిగా 8వ వార్డు కౌన్సిలర్ మండపల్లి రవికుమార్‌ను పార్టీ నియమించింది. ఈ సందర్భంగా రవికుమార్ శుక్రవారం మాట్లాడుతూ తనపై నమ్మకంతో పదవీ బాధ్యతలు అప్పగించిన శాసనమండలి సభ్యుడు తోట త్రిమూర్తులుకు, పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఆర్‌టీఐ ద్వారా కూటమి ప్రభుత్వంలోని లొసుగులను, అవకతవకలను బహిర్గతం చేసి ప్రజాక్షేత్రంలో ఎండగడతానని అన్నారు.

సామూహిక చర్యలతోనే మూషిక సంహారం

- రైతులకు ఉచితంగా బ్రోమోడయోలిన్ మందు పంపిణీ
- మందు వినియోగంపై వ్యవసాయ శాఖ సూచనలు




శీల ఆర్‌బీకే వద్ద వ్యవసాయ శాఖ సిబ్బంది ఆధ్వర్యంలో ఎలుకల మందు ఎరను తయారు చేస్తున్న రైతులు

కాజులూరు: పంటలపై ఎలుకల దాడి రోజు, రోజుకీ అధికమవుతోంది. రాత్రి, పగలు తేడా లేకుండా ముషికాలు పొలాల్లో విజృంభిస్తూ వరి దుబ్బులను మొదలకు కొరికి పారేస్తున్నాయి. చీడ పీడలను నివారిస్తూ ఎరువులు వేసి ఏపుగా పెంచిన వరి పంట ఎలుకల దాడికి నాశనమవుతుంటే రైతులు లబోదిబోమంటున్నారు. వాటి నివారణకు ఎన్నిచర్యలు చేపట్టినా ఫలితం నామమాత్రంగానే ఉంటోంది. బుట్టలు పెట్టి పట్టినా, బొరియల్లో పొగ పెట్టి ఊదరపెట్టినా, మందులు ఎన్ని వాడినా ఎలుకల ఉధృతి తగ్గటం లేదు. ఎలుకల నిర్మూలనకు అధికంగా ఖర్చు అవ్వటమే కాకుండా వాటి దాడికి గురైన పొలంలో ఎకరానికి 10 బస్తాల వరకు దిగుబడి తగ్గి పోతుందని రైతులు చెబుతున్నారు. రైతులు ఎవరి వారే తమ పొలాల్లో ఎలుకల నివారణ చర్యలు చేపట్టడం కాకుండా సామూహిక చర్యలు చేపడితే ఎలుకలను సమూలంగా నిర్మూలించవచ్చునని కాజులూరు మండల వ్యవసాయ శాఖాధికారి వి అశోక్ చెబుతున్నారు. సాధారణంగా రైతులు తమ పొలాల్లో మందులు పెట్టి ఎలుకలను నిర్మూలించినా పక్క పొలాల్లోంచి ఎలుకలు వచ్చి తమ సంతతిని వృద్ధి చేసుకుంటూ పంటలపై దాడి చేస్తుంటాయి. ఒక ప్రాంతంలోని రైతులందరూ ఒకే మారుగా ఒక పద్ధతి ప్రకారం నివారణ చర్యలు చేపడితే మంచి ఫలితాలు ఉంటాయి. ఈ నేపథ్యంలో శుక్రవారం నుంచి వ్యవసాయాధికారులు నియోజకవర్గ గ్రామాల్లో రైతుభరోసా కేంద్రాల ద్వారా బ్రోమోడయోలిన్ మందు పంపిణీ చేస్తున్నారు. రామచంద్రపురం నియోజకవర్గంలో మొత్తం 52 వేల ఎకరాల్లో ఈ ఏడాది వరి సాగవుతుండగా కాజులూరు మండలానికి 81 కేజీలు, రామచంద్రపురం మండలానికి 78 కేజీలు, కె గంగవరం మండలాలకు 80 కేజీలు చొప్పున బ్రోమోడయోలిన్ మందు విడుదలైంది. వాటిని వ్యవసాయశాఖ సిబ్బంది రైతులకు పంపిణీ చేస్తూ ఉపయోగించే విదానాలపై అవగాహన కల్పిస్తున్నారు.

మందు తయారీ, వాడే విధానం

జీవరాశుల్లో మనిషి, తిమింగలం తరువాత తెలివైన జీవి ఎలుకేనని కాజులూరు మండల వ్యవసాయాధికారి వి అశోక్ అన్నారు. ఎలుక మందుతిని తక్షణమే చనిపోయే పరిస్థితి వచ్చినప్పుడు ఆ సంకేతాలను ఇతర ఎలుకలకు అందిస్తుందని ఫలితంగా అవి మందు జోలికి వెళ్లవన్నారు. వ్యవసాయ శాఖ సరఫరా చేస్తున్న బ్రోమోడయాలిన్ మందు తిన్న ఎలుక రక్తనాళాలు స్తంభించి మూడు లేదా నాలుగు రోజుల తరువాత చనిపోతుందన్నారు. దీని వల్ల మందుపెట్టిన ఒక్కటి, రెండు రోజుల్లో దాదాపు పొలంలోని ఎలుకలన్నీ మందు తింటాయన్నారు. హెక్టారు పొలానికి అర కేజీ తయారు చేసిన మందు అవసరమవుతుందన్నారు. ఇందుకోసం రైతులు 480 గ్రాములు నూకలు, పది గ్రాముల నూనె, పది గ్రాములు బ్రోమోడయోలిన్ మందును కలిపి మందు ఎరను తయారు చేసుకోవాలన్నారు. ఈ మందును మూడు అంగుళాల వ్యాసం, 18 అంగుళాల పొడవు కలిగిన పీవీసీ పైపుల్లో 30 గ్రాములు చొప్పున వేసి పొలానికి నాలుగు మూలలా గట్లపై అమర్చుకోవాలి.

సామూహిక చర్యలతోనే మంచి ఫలితాలు



ఎలుకల నిర్మూలనలో సామూహిక చర్యలతోనే మంచి ఫలితాలు వస్తాయి. ఒక ప్రాంతంలోని రైతులందరూ సంఘటితమై ఒకే మారు బ్రోమోడయోలిన్ మందు ఎరను తయారు చేసుకుని పొలాల్లో వినియోగించాలి. మందు తయారీలో విష ప్రభావానికి గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.

– కర్రి రామారెడ్డి, రైతు గొల్లపాలెం

వ్యవసాయ శాఖ సిబ్బంది సూచనలు పాటించాలి



బ్రోమోడయోలిన్ మందు ఉపయోగించే సమయంలో రైతులు వ్యవసాయశాఖ సిబ్బంది సూచనలు తప్పకుండా పాటించాలి. లేని పక్షంలో మందు దుర్వినియోగం అవ్వటమే కాకుండా పొలాల్లో సంచరించే రైతు మిత్రపక్షాలైన ఇతర జీవులకు నష్టం వాటిల్లుతుంది.

– వనుం నారాయణరావు, రైతు, మతుకుమిల్లి